
# ఇహమూ పరమూ

చితి అంటుకుంది.

అంతసేపు నిశ్శబ్దంగా మనసులోనే రోదిస్తూ వచ్చిన మూర్తి దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. గుండె బద్దలవుతున్నట్టుగా ఉందతనికి.

అంతరాంతరాల్లో ఎక్కడినుంచో దుఃఖం ఉధృతంగా పైకి పొంగుకొస్తోంది. ఎన్నో సంవత్సరాల నుంచీ కంట తడిపెట్టని అతని గుండెల్లో దాగి గడ్డ కట్టిన కన్నీరంతా ఆ చితిమంటల వేడికి క్రమంగా చెక్కిళ్ళ మీంచి వరదలా జారుతున్నట్లుగా ఉంది.

మంట పైకి క్రమక్రమంగా లేస్తోంది. ఆబగా అన్నివైపుల నుంచీ మంటలు చుట్టుకొస్తున్నాయి. గాలికి సుడులు తిరుగుతూ ఆ మంట ఆకాశంవైపు దృష్టి మళ్ళిస్తున్నట్లుగా ఉంది.



చితిమంటల్ని తదేకంగా చూస్తున్న మూర్తికి - కన్నీళ్ళు నిండిన అతని కళ్ళకు - ఆ మంటల్లోంచి తన అమ్మ ఏకంగా స్వర్గానికి పయనమైపోతున్నట్లుగా అనిపించింది.

"అమ్మా" బావురుమన్నాడు మూర్తి.

అతని బాధ చూడలేకపోతున్నట్లుగా మంటలు నల్లరంగు పులుముకొంటున్నాయి. గాలి శవం కాలుతున్న వాసన కొడుతోంది.

అసలు అన్నీ అనుకున్నట్లుగా జరిగి ఉంటే ఈ పాటికి తను అమ్మతో కలిసి ఈ గంగా నదిలో స్నానాలు చేయాల్సి ఉంది. తను ఇంకొద్ది సేపటిలో అమ్మ జ్ఞాపకాల్ని... కాదు, కాదు, అవి చెరిగేవి కావు - అమ్మతో ఉన్న శారీరక బంధాలను తెంపుకొంటున్నట్లుగా వెళ్ళి ఒక్కడూ గంగలో మునిగి రావాల్సి ఉంది.

ఎంత దౌర్భాగ్యం!

మూర్తికి గత వారం పదిరోజులుగా తన జీవితం ఎన్నో మలుపులు తిరుగుతున్నట్లుగా ఉంది.

ఎప్పుడో ఏడాది కిందట పోయిన తండ్రి గ్రాట్యుటీ డబ్బు పదిరోజుల కిందట చేతికి అందింది. మొత్తం పాతికవేలకు పైగానే. అంత మొత్తం బతికి ఉండగా తండ్రి ఎప్పుడూ చూసి ఎరగడు. చచ్చి సంపాదించగలిగాడు. జీవితంలోని చిత్రం, వైరుధ్యం అంటే ఇదేనేమో!

"డబ్బు బ్యాంకులో వేశానమ్మా" అన్నాడు మూర్తి. ఆ అనడంలో బాధ ఉంది. తండ్రి పోయాడన్న బాధ అది.

వెన్నెల మెల్లిగా డాబా అంతా పరుచుకుంటోంది. ఆ డాబా మీద ఆ మూల సుచిత్ర పిల్లల్ని నిద్రపుచ్చుతోంది.

తండ్రి చనిపోయి ఏడాది అయినా ఈ రోజు డబ్బు చేతికి అందడంతో పాత జ్ఞాపకాలు మరీ ముసురుతున్నాయి. మూర్తి నిర్లిప్తంగా పిట్టగోడకు ఆనుకుని కూర్చుండిపోయాడు. ఆకాశంలో మేఘాలు నెమ్మదిగా కదులుతున్నాయి.

అప్పుడు మూర్తి దగ్గరకొచ్చింది జానకమ్మ. నెమ్మదిగా అంది. "నేనిలా అంటున్నానని కష్టపెట్టుకోకురా అబ్బాయ్!"

"చెప్పమ్మా!"

"ఆ గ్రాట్యుటీలోంచి నాకో పదివేలు కావాలిరా!" అంది.

ఉలికిపడ్డాడు మూర్తి. పదివేలు! ఎందుకు? అదే అడిగాడు.

"నువ్వేం అనుకోకు. నువ్వు, అమ్మాయి నన్ను ప్రాణంలా చూసుకుంటున్నారు, కాదనను. కానీ నాకే ఎందుకో మనసు నిలవడంలేదు. ఇక్కడ ఉండబుద్ధి కావడంలేదు".

"మరి ఎక్కడ ఉంటావమ్మా? నా కిక అన్నదమ్ములు కూడా లేరు కదా!"

"నిజమే! నీకు అన్నదమ్ము లెవరూ లేరు. వెళ్లాలంటే నాకు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఉన్నారు. కాని నేను వాళ్ళ ఇళ్ళకు వెళ్ళను! నాకు.. కాశీ వెళ్ళాలని ఉందిరా! వెళ్ళి... అక్కడే ఉండిపోవాలని ఉంది!

మూర్తి నివ్వెరపోయాడు. "కాశీలో ఎవరున్నారమ్మా, మనకు?"

జానకమ్మ తల ఊపింది ఎవరూ లేనట్లు.

"మరి ఎక్కడుంటావ్?" మూర్తి ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"కాశీలో చాలా ఆశ్రమాలున్నాయట! మనం ఓ పదివేలు వాళ్ళకు ఇచ్చేస్తే... దాన్ని బ్యాంకులో వేసి ఆ డబ్బుమీద వడ్డీతో మన పోషణ చూస్తారట. ఏదో బతికినంత కాలం అక్కడే గడిపి... ఆ గంగ ఒడ్డునే బూడిదైపోవాలని ఉంది!"

జానకమ్మ కోరిక ఆ తరువాత రెండు రోజులూ ఆ ఇంట్లో చర్చనీయాంశం అయింది.

ఎన్నోవిధాల నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు మూర్తి - "ఎందుకిపుడు కాశీకి? ఉడిగే వయసు వచ్చాక చూద్దాం!" అన్నాడు.

"నే పోయే రోజు నీకు తెలుస్తుందట్రా! ఆ రోజు తీసుకెడతానంటున్నావ్?" అంది జానకమ్మ.

"పోనీ, అమ్మా! ఆ డబ్బు నేను నీ పేరుమీద ఇప్పుడే ఆశ్రమానికి పంపేస్తా! నువ్వు ఇక్కడే ఉండమ్మా!" నచ్చచెప్పబోయాడు.

జానకమ్మ ఒప్పుకోలేదు. "బతికి ఉండగానే ఆ డబ్బులో కొంత నన్ను తిననీయరా! మిగిలిన దాంతో పరానికి కొంత పెట్టుబడి పెట్టుకోనీరా!" అంది.

తప్పనిసరై ఇష్టం లేకున్నా కాశీకి ప్రయాణం కట్టాడు మూర్తి. మూడు రోజులు క్రిందట. నిన్న ఉదయం చేరారు కాశీకి. ఉన్న ఆశ్రమాలలో మంచిది చూసి తల్లిని అందులో చేర్చి వెళ్ళాలన్న ప్రయత్నం అతనిది.

"ఇప్పుడైనా ఆలోచించమ్మా! నీ ఇష్టప్రకారం కాశీకి రానే వచ్చాం! ఇక్కడ చూడాల్సినవన్నీ చూద్దాం. కాశీ విశ్వేశ్వరుడిని పూజిద్దాం. అన్నపూర్ణను అర్చిద్దాం. గంగా స్నానాలు చేసుకొందాం. వెనక్కు వెళ్ళిపోదాం. మళ్ళీ నీకు ఎప్పుడు రావాలని ఉంటే అప్పుడు వచ్చేద్దాం. నా మాట వినమ్మా!" అన్నాడు మూర్తి.

"వద్దురా! అబ్బాయ్! నా జీవితం ఇక్కడే ముగియాలి. నా కోరిక ఇదే! మళ్ళీ వచ్చే ప్రసక్తే వద్దు. ఇప్పుడు వచ్చాం కదా! నీ పని ముగించుకు వెళ్ళు. మళ్ళీ ఎప్పుడైనా నీకు చూడాలనిపిస్తే రా... నాకు చూడాలనిపిస్తే రాస్తాను, రా! అది చాలు!" అంది జానకమ్మ.

ఎలాగూ కొడుకుతో కలిసి వచ్చాను కదా! పని ముగించుకు వెళ్దామనుకుంది కాబోలు జానకమ్మ.

ఈ రోజు ఉదయం నిద్ర లేవలేదు మరి!!

ప్రాణాలతో వచ్చిన జానకమ్మ ప్రాణాలు పోయి కట్టెగా మిగిలింది. గంగ ఒడ్డున కన్ను మూయాలనుకున్న ఆమె గంగ ఒడ్డుకు చితిగా చేరింది.

చితి కాలుతోంది. మంటలు. ఎర్రగా... కసిగా ఉన్నా... అన్నివైపులా ఆవరించుకున్నాయి. చితిలోంచి మంటలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. సుడులు తిరుగుతున్నాయి మూర్తి మనసులో ఆలోచనల లాగానే.

"లేమ్మా..లే!" అంటూ లేపాడు మూర్తి జానకమ్మను.

ఇంకెక్కడ లేవడం? చిలక ఎప్పుడో ఎగిరిపోయింది. గంగ ఒడ్డునే కాశీపట్నంలో కట్టెగా మిగిలింది జానకమ్మ. ఊరుగాని ఊరు. వచ్చింది తల్లిని విడిచిపెట్టి వెళ్ళడానికే అయినా ఇలా కాదు విడిచి పెట్టదలచింది! కానీ అనుకున్నది అనుకున్నట్లు జరగదు కదా!

చితి మంటలు మూర్తిని భయపెడుతున్నట్లుగా ఉన్నాయి. జీవితంలోని చేదునిజాల్ని తమ నాలుకల్లాటి జ్వాలల రూపంలో స్పష్టం చేస్తున్నట్లున్నాయి. నిన్నటి వరకు ఉన్న మనిషి నేటికి లేకుండా పోవచ్చునన్న భయంకర సత్యాన్ని ప్రపంచానికంతా చాటిచెప్పాలని పైకి మెడలు చాస్తున్నట్లుగా ఉన్నాయి.

ఏదో తెర అడ్డం వచ్చినట్లయి మూర్తి ఉలిక్కిపడ్డాడు. నిజమే, తెరే అది. ఎవరో ఆ చితిమంటలలో బట్టలు ఆరవేసుకుంటున్నారు.

మూర్తి నివ్వెరపోయాడు. చావంటే భయం లేదా వీళ్ళకు? ఇక్కడ... మణికర్ణిక ఘాట్‌లో చావుకు ఇంత సమీపంలో ఉన్న తనకు.. నిజంగా మృత్యువుతో ముఖాముఖి జరుపుతున్నంత భయం నిండిందే! ఎదురుగా మంటల్లో మసి అయిపోతున్నది తన తల్లి కాకుంటే ఇక్కడనుంచి వేలాది మైళ్ళ దూరానికి పారిపోడూ తను? అలాటిది... వీళ్ళు ... నిర్వికారంగా, ఇంత నిర్భయంగా... ఎలా... ఇలా... తడి బట్టల్ని ఆరబెట్టుకుంటున్నారు? ఈ మంటలకు ఆరిన బట్టలను వీళ్ళెలా ఒంటికి చుట్టబెట్టుకోగలుగుతారు? వీరికి ఆ బట్టలు కట్టుకుంటే చావును కప్పుకొన్నట్లు ఉండదా?

మూర్తి గుండెలోంచి భయం పైకి పొర్లుకొచ్చింది. ఆ భయానికి నివ్వెరపోయినట్లు కంటి నీటి తడి ఆరిపోయింది.

కంటిముందు దృశ్యాలు అతన్ని కలవరపెట్టాయి. ఎదురుగా మండుతున్న చితి. చితిలోకి అప్పుడొకటి అప్పుడొకటి ఎవరో తన తరఫున కొబ్బరికాయలు విసురుతున్నారు. చనిపోయిన వారి ఆఖరి ఋణాన్ని తీర్చుకుంటున్న తీరులో! ఆ కాయలు అటు మంటల్లో పడటం ఏమిటి, ఎవరో పిల్లలు పది పదిహేను మంది చింపిరిబట్టల వాళ్లు చేతుల్లో కర్రముక్కలతో అచ్చం కాటికాపరుల్లా ఉన్నవాళ్ళు వాళ్ళు. ఆ మంటల్లోంచి ఆ కొబ్బరికాయల్ని బయటకు లాగుతున్నారు. బయటకొచ్చిన ఆ కొబ్బరికాయల్ని పరుగున వెళ్ళి గంగ నీళ్ళలో ముంచి మెట్లమీదకు తెచ్చి బద్దలు కొట్టుకొంటున్నారు. ముక్కల్ని పంచుకుంటున్నారు. ఆకలిగా తింటున్నారు.

మూర్తికి అది చూసేసరికి నోట్లో తడికూడా ఆరిపోయింది. జరుగుతున్నది కలో నిజమో అర్థం కావడం లేదతనికి! చావు.. ఎంతటి భయంకరం అది! అయినా ఈ పసివాళ్ళు భయపడడం లేదు. సరికదా, దాంతో ఆటలాడుకొంటున్నారు. తన తల్లి చితిలోంచి వాళ్ళు ఆకలి తీర్చుకుంటున్నారు. చచ్చిపోయి కూడా తన తల్లి... మాతృ హృదయంతో వాళ్ళ ఆకలి తీరుస్తోంది.

ఎవరో నల్లగా, లావుగా, మూర్తీభవించిన మృత్యువులా ఉన్నవాడు నెమ్మదిగా నడిచాడు

చితివైపు. పొడవాటి కర్రతీసి చితినంతా కలియదీశాడు. ఇంకా మిగిలిపోయిన తల్లి శారీరక చిహ్నాల్ని పూర్తిగా నాశనం చేస్తున్నట్లుగా..

ఆ తర్వాత అట్నుంచి ఇంకో ఇద్దరు వచ్చారు. వాళ్ళ చేతుల్లోనూ పొడవైన కర్రలు. ఆ కర్రల్ని అన్ని పక్కలనుంచి చితిలోకి గుచ్చారు. ఒక్కసారి బలాన్నంతా ఉపయోగించి చితిలో మిగిలిన భాగాన్ని పైకి లేపారు. ఒక్క ఊపుతో దాన్ని గంగ నీళ్ళలోకి విసిరారు. కాలుతున్న తల్లి శవం గింగిర్లు కొడుతూ గంగలో పడింది. బుస్సుమంటూ పొంగులు... మంటలారుతున్న చప్పుళ్ళు.

మూర్తికి గుండెని ఎవరో పట్టుకుని పిండినట్లుగా అనిపించింది. జరుగుతున్న దృశ్యాలన్నీ కలలాగా ఉన్నాయి తప్ప నిజాలని అనిపించడం లేదతనికి!

లేకుంటే ఏమిటి? ఉదయం తల్లి శవంగా మారాక మూర్తి మణికర్ణిక ఘాట్‌కు చేరాడు. అక్కడున్న వారికి జరిగింది చెప్పాడు. వాళ్ళు అంతా నిశ్శబ్దంగా విన్నారు.

“అయిదు వేలవుతుంది” అన్నాడు కాపరి. మూర్తి నివ్వెరపోయాడు. “అయిదు వేలా?”

“అంతే!”

“అందరికీ అంతేనా?” అనడిగాడు మూర్తి ఆశ్చర్యంగా. అక్కడున్న శవాల్నీ, ఆ శవాల దగ్గరున్న వాళ్ళనీ చూస్తోంటే అందరూ అయిదేసి వేలు ఇచ్చుకోగలిగిన వారిలా లేరు! మరి...?

“అందరికీ ఒకే రేటెలా ఉంటుంది? స్థితిని బట్టి, స్తోమతనుబట్టి...” కాపరి విడమరచి చెప్పాడు తన భాషలో. అంటే చావులో కూడా అసమానతల్ని సృష్టిస్తోంది ఈ డబ్బు! ఈ డబ్బు కెంత శక్తి ఉందో గదా!!

“అంత ఇచ్చుకోలేను!” మూర్తి నెమ్మదిగా అన్నాడు.

అటు పక్కన తల్లి శవం. ఇటు పక్కన తన బేరాలు, మూర్తికి చచ్చిన చావుగా ఉంది. ఎంత అసహ్యకరమైన పరిస్థితి ఇది. కానీ తప్పదు. ఆత్మను చంపుకొని అయినా ఒక్కోసారి ఇలాంటి నిజాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది.

తల్లి శవంమీదుగా నిండుగా బంతిపూలు. బతికినప్పుడు ఒక్క పువ్వుతోనైనా పూజించుకోలేకపోయాడు గానీ, ఇప్పుడు ఒంటినిండుగా పూలు కప్పాడు తను! శవానికి పక్కనే బలిసిన గొర్రె నిర్వికారంగా తిరుగుతోంది.

“మీ ఇష్టం. ఇక్కడ దహనం చెయ్యదల్చుకొంటే అంతా ఇవ్వాల్సిందే! లేకుంటే తీసుకెళ్ళిపోండి!” కాపరి మాటల్లో కరకుదనం ఉంది.

“ఇక్కడ బేరా లేమిటండీ? మీరు ‘ఊ’ అనడం మంచిది. మీరు ‘ఊ’ అంటేనే ఆ గొర్రె ఆ బంతిపూలను ముడుతుంది. అది ఆ బంతిపూలను తిన్నాకనే శవానికి పవిత్రాగ్నిని ఇస్తారు. ఆలస్యం ఎందుకు? కానివ్వండి!” అంటూ సలహా ఇచ్చాడు మూర్తితోపాటు హోటల్‌నుంచి వచ్చిన వ్యక్తి.

మూర్తికి ఏమీ పాలుపోవడంలేదు. ఇక్కడి పద్ధతులన్నీ కొత్తగా, వింతగా ఉన్నాయి.

శ్మశానఘాట్ మీద ఇతని అధికారం ఏమిటనిపించింది. అందుకే వితండవాదం కూడా చేశాడు. కానీ, "ఇక్కడి పద్ధతి ఇదీ! ఇది ఇతనికీ, ఇతని వంశంవారికీ ఆ సదాశివుడిచ్చిన వరం! అందరికీ అదే శిరోధార్యం. అయినా ఇంత దూరంవచ్చి ఇప్పుడు వెనకాడడం ఏమిటి? ఊ అనండి!" అంటూ సలహా ఇచ్చాడు హోటల్ యజమాని.

మూర్తి నెమ్మదిగా ముందుకు కదిలాడు. "సరే కానీండి!" అన్నాడు.

మెట్లమీద అంతసేపూ ఎక్కడ నక్కిందో ఆ గొర్రె ఆ మాటతో పరుగున కిందకు దిగింది. జానకమ్మ శవంచుట్టూ ఎవరో దగ్గరుండి చేయించినట్లుగా ఒక చుట్టు తిరిగింది. ఆ తర్వాత నెమ్మదిగా కాళ్ళవైపు నుంచి ఆరంభించి బంతిపూల మాలలన్నిటినీ భుజించింది.

అటు తరువాత ఆరంభమయింది అసలు అంత్యక్రియల కార్యక్రమం. పూజారి చెప్పినట్లుగా చేశాడు మూర్తి. తరువాత శవాన్ని రెండు గెడ కర్రలకు తగిలించి ఒకసారి గంగలో ముంచి తీసి ఆ తరువాత చితిమీద చేర్చారు. పవిత్రాగ్ని నుంచి నిప్పు తెచ్చి చితికిపెట్టారు. శతాబ్దాల నుంచి ఆరకుండా మండుతున్న పవిత్రాగ్ని అట అది! ఆ అగ్నిజ్వాల తగిలితే చాలు శవానికి ఇహంనుంచి పరమే లభ్యమవుతుందట! చితి అంటుకొంది.

ఇప్పుడు చితిలేదు. మంటలు లేవు. పొగలు లేవు. కాలుతున్న శవాలు లేవు. మూర్తికి తల్లి లేదు. జానకమ్మకు ఇహం లేదు. ఉన్నదంతా పిడికెడు బూడిద!

గంగలో.. చితిలో కాలిన కర్రలు నెమ్మదిగా తేలుతున్నాయి. ఇంకో పక్కనుంచి ఆరేడు చిన్న చిన్న పడవల్లో వచ్చి ఆ కాలి చల్లారిన కర్రల్ని కొందరు ఏరుకుంటున్నారు.

"అవి-రేపు ఈ కాపరి ఇంట్లో వంటకి ఉపయోగిస్తారు!" ఎవరో ఎవరికో చెప్తున్నారు. మూర్తి విని నివ్వెరపోయాడు.

ఇదేం ప్రపంచం, ఇదేం బతుకు! చావులోంచి జీవితాన్ని ఏరుకుంటున్న మనుషులు వీళ్ళు! శవాలలోంచి ఊపిరులు పీల్చుకుని జీవిస్తున్న రాక్షసులు వీళ్ళు! వీళ్ళకు ఇదంతా దారుణమన్న భావనే లేదా?

బతికి ఉన్నప్పుడు చంపుకు తినే మనుషులున్న ప్రపంచమే ఇన్నాళ్ళుగా తనకు తెలుసు. ఇప్పుడో కొత్త ప్రపంచంతో పరిచయం అయింది. మనిషి రూపంలో ఉన్న రాక్షసులతో పరిచయం ఏర్పడింది.

మూర్తి ఇంకా మెట్లమీదే కూర్చుండిపోయాడు. ఇప్పుడతనిలో ఒక గంట క్రితం ఉన్న భావాలు ఏవీలేవు. కొత్తరకం ఆలోచనలు అతన్ని ఆవరించుకుంటున్నాయి. తల్లి కాలిపోయిన చోట... ఇపుడు తల్లి గుర్తులేమీ లేవు. కాలిపోయిన కర్రలు మిగిల్చిన బూడిద... అక్కడక్కడా మిగిలిన నిప్పురవ్వలు ఆ బూడిద పోగుచుట్టూ ఇపుడు కొందరు కూర్చుని ఉన్నారు. ఆ బూడిద కుప్పలోంచి నిప్పురవ్వల్ని ఏరుకుంటున్నారు. చిలుంలో నింపుకొంటున్నారు. గుప్పుగుప్పున పొగల్ని వదులుతున్నారు.

చావంటే జీవితానికి ఆఖరు అనుకున్నాడు మూర్తి ఇంతకాలమూనూ! కానీ ఇప్పుడు? కొందరి చావు ఇంకొందరికి జీవితం అన్న సంగతి అర్థమవుతోంది అతనికి! చావంటే

అందరికీ సమానమనే అనుకున్నాడు. కానీ... కొందరికి చావు పైసలలో అయితే, ఇంకొందరికి వందలలో, మరికొందరికి వేలల్లో.. ఆఖరికి చావు దగ్గరకూడా సాగుతోంది వ్యాపారం! మనిషి ఎంతగా దిగజారిపోగలడో అద్దం పడుతున్నట్లుగా ఉంది ఆ శ్మశానం ఘాట్. 'చచ్చినా' ఇలాటిచోటుకు రాకూడదనుకున్నాడు మూర్తి. అక్కడి పద్ధతులు చూసి వెగటు పుట్టి!

"రండి వెడదాం!" అన్నాడు హోటల్ యజమాని.

మూర్తి లేచాడు. నెమ్మదిగా రెండడుగులు వేశాడు. తల్లి మట్టిగా, పిడికెడు బూడిదగా మారిన చోటుకు చేరాడు. ఇంకా అక్కడి గాలి వేడిగా ఉంది. భయం పుట్టిస్తున్నట్లుగా ఉంది.

మూర్తి తల్లిమీద గౌరవంతో, ఆ స్థలం చుట్టూ ముమ్మారు తిరిగాడు. ఒక్కో అడుగు వేస్తోంటే తల్లికి దూరంగా బహుదూరంగా పోతున్నట్లు అనిపించిందతనికి. ఆఖరిసారి తిరుగుతున్నప్పుడు అతని గుండె బేజారయింది. ఒక్కసారి నెలల పిల్లాడిలాగ భోరుమన్నాడు. ఆ ప్రాంతంలో తల్లికోసం పిచ్చిగా వెతుక్కుంటున్నట్లు నేలమీద పడ్డాడు.

కొద్దిసేపటికి తేరుకుని లేచాడు మూర్తి. అయిపోయింది. తల్లి పదివేలు కావాలంది. తను అయిదు వేలిచ్చి ఋణం తీర్చుకున్నాడు. చనిపోతూ కూడా, తనకు మేలే చేసింది అమ్మ. మళ్లీ ఇంకోసారి రానవసరం లేదన్నట్లుగా ఇప్పుడే అన్ని పనులూ చేసుకు వెళ్ళిపోమన్నట్లుగా తుది శ్వాస ఇక్కడే వదిలిపెట్టింది. ఋణం తీరిపోయింది. అమ్మతో కలిసి వచ్చి, అమ్మను వదిలిపెట్టుకొని, పోగొట్టుకొని వెళ్తున్నాడు తను! ఎంతటి దౌర్భాగ్యుడు తను!

మూర్తి మెట్లు దిగాడు. దూరంనుంచి చూస్తే నిర్మలంగా కనిపించిన గంగ దగ్గరకు చేరేసరికి కల్మషంగా కనిపించింది ఈ చావులాగే!

ముక్కు మూసుకుని మూర్తి గంగలో మునిగాడు. క్షణంసేపు తల్లిని తలుచుకుని కన్నీరు కార్చాడు. రక్తసంబంధం తీరిపోయినట్లు ఒంటిమీంచి ఒక్కో చుక్కా నీరు కిందకు కారుతుంటే గంగలోంచి లేచి మెట్లెక్కాడు మూర్తి.

ఎదురుగా మెట్లమీద ఆ శ్మశానఘాట్‌లో కాపరి నోట్లు లెక్క పెట్టుకొంటూ కనపడ్డాడు మూర్తికి. జీవితం ఒక్కసారి అసహ్యంగా తన అసలు రంగుల్ని బయటపెడుతున్నట్లు అనిపించింది అతనికి. ఇంకొక్కసారి మళ్ళీ రావాలనిపించింది మూర్తికి - ఎవరూ రావాలని కోరుకోని ఆ మణికర్ణిక ఘాట్‌కి.

❖ ❖ ❖

మర్నాడు మూర్తి మళ్ళీ మణికర్ణిక ఘాట్‌కు చేరుకున్నాడు. నిన్నటి రాత్రంతా అతనికి నిద్రలేదు. ఏవేవో కలలు, కలతలు, ఆలోచనలు, ఆందోళనలు. పగటిపూట చూసిన దారుణ దృశ్యాలన్నీ అతన్ని రాత్రంతా వేటాడి వేధించాయి. కన్ను మూసినా, తెరిచినా అవే దృశ్యాలు.

ఘాట్ మెట్లు విశాలంగా ఉన్నాయి. జిడ్డుతో ఉన్నాయి. జారితే కింద గంగలోకి

చేర్చేటట్లుగా ఉన్నాయి. కింద గంగనీళ్ళు మడ్డిగా ఉన్నాయి. నల్లగా ఉన్నాయి. లోపలి కల్మషం బయటకు కనిపించకుండా బంతిపూల బట్టలు కట్టుకొన్నట్లుగా ఉన్నాయి.

మూర్తి నిర్వికారంగా ఆ మెట్లమీద కూర్చున్నాడు. దూరంగా ఒక చితి కాలుతోంది. ఆ చితిమీంచి మంటలు వలయాలు తిరుగుతూ పైకి లేస్తున్నాయి. శవం కాలుతున్న వాసన కడుపులో దేవుతోంది. ఇంకో పక్క గంగ నీళ్లమీద ప్రయాణం చేస్తున్న పడవల్లోని పిల్లలు సగం కాలిన కర్రముక్కల్ని వంటచెరుకు కోసం ఏరుకుంటున్నారు. మరోపక్క చుట్టుపక్కల గ్రామాలనుంచి శవాలను మణికర్ణికకు చేర్చే బస్సులోంచి ఎవరో కొందరు, కొన్ని శవాల్ని దింపుతున్నారు.

నిన్న ఇవన్నీ చూసి భయపడిన మూర్తిలో ఇపుడు ఆ భయం లేదు. నిర్లిప్తత నిండి ఉంది.

అతనికి దూరంగా ఎవరితోనో బేరం ఆడుతున్న కాపరి కనిపించాడు. మూర్తి లేచాడు. జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ అతనికేసి నడిచాడు. మూర్తిని చూసి ఆ కాపరి చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు చూస్తున్న మూర్తికి మృత్యువును చూస్తున్నట్లుగానే అనిపించింది.

"మీతో కొంచెం మాట్లాడాలని ఉంది. వీలవుతుందా?" అతన్నడిగాడు మూర్తి. వీలైనంత మర్యాదతో అడిగాక తనే ఉలిక్కిపడ్డాడు. ఎంత మామూలుగా అంటున్నాడా మాట. నిన్న తనలో అతనంటే పెరిగిన అసహ్యం ఈ క్షణంలో ఎలా దాచిపెట్టుకోగలిగాడు!

కాపరి నవ్వాడు. "నాతోనా? ఏం మాట్లాడతారు?" అని క్షణం ఆగి అడిగాడు. "నిన్న డబ్బు ఎక్కువ తీసుకొన్నాననా? పోనీండి. అంతా ఇచ్చేస్తాను! తీసుకెళ్ళిపోండి!" అన్నాడు నవ్వుతూ.

నిన్న ఒక్క రూపాయి కూడా తగ్గేది లేదని నిక్కచ్చిగా చెప్పిన వ్యక్తి ఈ రోజు అంతా వెనక్కు ఇచ్చేస్తానంటున్నాడు. ఒకటా, రెండా... అయిదు వేలు! నిజమే? తన మనసులోని ఉలికిపాటు కప్పిపుచ్చుకుంటూ అన్నాడు మూర్తి – "అది కాదు నే నొచ్చిన పని! మీతోటి మాట్లాడాలని. ఆర్థిక విషయాలు కాదు. వ్యక్తిగతం! 'మీ' వ్యక్తిగతం!"

"చెప్పండి. మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికి వెడదాం రండి!"

"అభ్యంతరం దేనికి? పదండి!" అన్నాడు మూర్తి.

కాపరి ముఖంలో చెప్పలేనంత ఆశ్చర్యం. ఆ తరువాత ఆనందం!

ఇల్లు అన్నాడేగానీ నిజానికి అదో రాజభవనంలా ఉంది. మూర్తి లోపలకు రాగానే అన్నాడు అతను. "మా ఇంటిలో అడుగుపెట్టిన తొలి అతిథి మీరే! నమ్మండి, నమ్మకపోండి. ఇది నిజం!"

మూర్తి ఆ విషయం నమ్మలేకపోతున్నాడు. కానీ అబద్ధం చెప్పాల్సిన అవసరం ఏముంది అతనికి అనిపించింది.

మెట్లెక్కి డాబామీద కూర్చున్నాక అడిగాడు అతను. "ఇప్పుడు చెప్పండి. మీరు ఏం అడగదల్చుకున్నా అడగండి".

మూర్తికి క్షణం చిన్నతనంగా అనిపించింది. పొరపాటు చేస్తున్నానా అన్న శంక ఒకసారి మనసులో మెదిలింది. అయినా అడిగాడు – "ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకండి. మీకు ఇష్టం లేకపోతే జవాబు కూడా చెప్పకండి. ఇలా చావుమీద డబ్బు చేసుకు బతకడం మీకు అసహ్యంగా లేదూ? ఎదుటివాడి ఇబ్బందినీ, అవసరాన్నీ ఇంత దారుణంగా మీ స్వార్థానికి, వేలకొద్దీ డబ్బు పోగు పోసుకోడానికీ ఉపయోగించుకోవడం మీకు చిన్నతనంగా లేదూ? నిన్న మీరు నా దగ్గర... డబ్బుకోసం అంత పట్టుబడుతూంటే నాకు మీరంటే కోపమే గాదు, చెప్పలేనంత అసహ్యమూ వచ్చింది..."

మూర్తి ఆగాడు. మాటలకు ఆవేశం అడ్డొస్తోంది. ఇంకా పచ్చిగా అడుగుదామంటే సంస్కారం అడ్డొస్తోంది.

అతను నవ్వాడు. చిన్నగా, నిర్వికారంగా, నిర్లిప్తంగా! మంచి ప్రశ్న అడిగావన్నట్లుచూశాడు.

"చెప్పాను గదా, మీకు ఆ డబ్బు తిరిగి ఇచ్చేయమంటే ఇచ్చేస్తాను. నిరభ్యంతరంగా!" ఇంకోసారి అన్నాడు అతను.

మూర్తి తల ఊపాడు. "వద్దు! నేను వచ్చింది ఆ డబ్బు కోసం కాదు. మీ అసలు సంగతి తెలుసుకుందామని, వీలైతే మీ పద్ధతి మార్చుకోమని అడుగుదామని! నేను ఈ ఊరివాడిని కాను, ఈ వాడ వాడినీ గాను. అయినా నాకే మీ పట్ల ఇంత రోత కలిగిందంటే మీరంటే మీ చుట్టూ ఉన్న మనుషులకెంత అసహ్యం పెరిగి ఉంటుందో ఆలోచించండి!"

అతను నవ్వాడు. ఒక్కసారి తన జీవితంలోకి, అంతరాంతరాల్లోకి తొంగిచూసుకుంటున్నట్లు కళ్ళు మూసుకున్నాడు. ఆ తరువాత నెమ్మదిగా కళ్ళు తెరుస్తూ అన్నాడు – "నిజమే! మీరంటున్నది నిజమే! అసలు మీకేమిటి... నా జీవితం అంటే నాకే రోతగా ఉంది. అసహ్యంగా ఉంది. అవకాశం లభిస్తే ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోంది. మీరన్నట్లు చచ్చిపోయిన మనుషులతో వ్యాపారం చేసుకుంటున్నాను నేను! కారణం... కసి.. నాకు ఈ లోకమంటే ఉన్న కక్ష...!"

అతని ముఖంలో ఇంత క్రితం ఉన్న భావాలేమీ లేవు ఇపుడు. ఒకరకమైన దౌర్బల్యం అతన్ని లొంగదీసుకున్నట్లుగా అనిపించింది మూర్తికి.

"మీరెవరో నాకు తెలీదు. ఈ రోజు తరువాత మళ్ళీ మీతో మాట్లాడే అవకాశమూ రాదు. మీ తోటే కాదు. ఇంకెవరితోటీ ఇది చెప్పగల అవసరమూ, అవకాశమూ ఉండదు. అందుకే నిజం చెప్తున్నాను. నిజాయితీగా చెప్తున్నాను. నాకు బతికి ఉన్న మనుషులందరి మీదా చెప్పలేనంత కసి ఉంది. అవకాశం ఉంటే.. వీళ్ళందర్నీ ఒకే పాడెకు కట్టి చితి అంటించాలని ఉంది. ఆ అవకాశం లేదు. కాబట్టే... వీళ్ళను చంపుకుతింటున్నా".

"ఎందుకూ?" ఆశ్చర్యంగా అడిగాడు మూర్తి.

"ఎందుకా? ఈ లోకం నన్నో మనిషిగా చూడనందుకు! నా జీవితాన్ని బతికి ఉండగానే ఈ శవాలమధ్య నాశనం చేసినందుకు. మీకు తెలీదు. కానీ నాకు ఈ ఊళ్ళో... ఇంత పెద్ద

ఊళ్ళో... స్నేహితులు లేరు, బంధువులు లేరు, ఎవరింటికీ నేను వెళ్ళే వీలులేదు. ఎవరూ నా ఇంటికి రారు. ఏ వీధిలోకి వెళ్ళే అర్హత నాకు లేదు. ఆఖరికి ఆ గుడిలోకి తొంగిచూసే అర్హత లేదు నాకు! నేను... నా పిల్లలు, నా భార్య ఇదే నా ప్రపంచం! అక్కడ కాలుతున్న ఆ శవాలే నాకు చుట్టాలు. ఆ శవాల బంధువులు, బతికి ఉన్న మానవులు అందరూ నాకు శత్రువులే! చెప్పండి. ఏ పాపం చేశానని నన్నీ లోకం ఈ శ్మశానానికి కట్టి పడేసింది? మీరు నమ్మరు. నా దగ్గర వేలుకాదు, లక్షలున్నాయి. కానీ నా పిల్లలు ఇంతవరకు ఒక్క సినిమా ఎరగరు. అంతదాకా ఎందుకు? ఈ ఊళ్ళో నాలుగు వీధులూ తిరిగి ఎరుగరు. వాళ్ళే పాపం చేశారని వాళ్ళకీ శిక్ష? ఈ శిక్ష వేసినందుకే ఈ జనాన్ని చంపుకు తింటున్నా నేను! నీచాతినీచమైన ఈ నికృష్టపు బతుకు నాకు పరిమితం చేసినందుకే నా కీ కక్ష! అందుకే డబ్బుకోసం, వీళ్ళకు చాలా ఇష్టమైన డబ్బుకోసం, నాకు ఆ డబ్బు అవసరం లేకున్నా వాళ్ళను కాల్చుకు తింటున్నా...!"

మూర్తి ఏమీ మాట్లాడలేదు. ఇప్పు డా ఇంటిని చూస్తోంటే అతనికి అది రాజభవనంలా కాదు. మృత్యులోయగా అనిపించింది. లోయలో ఎక్కడో అగాధాల మధ్య కూరుకుపోయిన మనిషిలా అనిపించాడతను!

"ఇంత సంపాదిస్తున్నా... ఏం చేసుకోను? ఈ డబ్బు దేనికి పనికి వస్తుందో కూడా నాకు తెలీదు. మీరు మీ బంధువులకు పరాన్ని ప్రసాదించడానికి ఇక్కడ నా దగ్గరకొచ్చి మీ పని జరిపించుకుంటున్నారు. నేను వేలు కాదు, లక్షలు ఇస్తాను. నా దగ్గరున్న లక్షలన్నీ ఒకేసారి మీ పరం చేస్తాను. నాకు పరాన్ని కాదు, ఇహాన్ని ప్రసాదించండి! ఈ శవాల మధ్యనుంచి విముక్తి ప్రసాదించండి! చచ్చిన శవాల మధ్య బతికే పాడు బతుకునుంచి నన్ను బయట పడెయ్యండి. నన్నూ బతికి ఉన్న మనిషిగా ఒక్కసారి మీ అందరిలాగే బ్రతకనివ్వండి...!"

కాపరి కళ్ళలో నీళ్ళు. అతని గుండె బద్దలయింది. కోపమూ, నిస్సహాయతా కన్నీటి రూపంలో పెల్లుబికి వస్తున్నాయి.

మూర్తి మాట్లాడలేదు. మాట్లాడలేకపోతున్నాడు. ఆ వాసనలు ఆ వాతావరణాన్ని నింపుతూనే ఉన్నాయి. గాలి ఆ వాసనలతో భరించలేనిదిగా ఉంది. మూర్తి ఆ మృత్యుగంధాలను భరించలేకపోయాడు. మాట్లాడకుండా మెట్లు దిగాడు.

ఆ కాపరి కళ్ళలో ఇంకా నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

'నువ్వు... నువ్వూ అతన్ని ఇలాగే వదిలేసి వెళ్ళిపోతున్నావా?" అన్నట్లు గంగ ఒక్క సెకను ఆగి ప్రశ్నించి 'అవును మరి! నువ్వూ ఈ సమాజంలోని మనిషివే గదా! అన్న ఈసడింపుతో రెట్టింపు వేగంతో కదిలినట్లుగా అనిపించింది మూర్తికి.

మూర్తి ఒక్కసారి ఆ మెట్లమీద కూలబడి ఏడ్చాడు – ఈసారి తల్లి కోసం మాత్రం కాదు!'

– *ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక, 15.04.87*